ధారూరులో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

ధారూరు, అక్టోబరు 8: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ఉపాధికి పరిశ్రమలు స్థాపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ధారూరులో సీపీఎం 4వ మహాసభ నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ధారూరులో విద్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్.మహిపాల్, చంద్రయ్య తదితరులున్నారు.

జొన్నరొట్టె.. నాటుకోడి కూర

(7వ పేజీ తరువాయి)

కూర్చునే వాళ్లం. లాస్ట్‌బెంచ్ స్టూడెంట్స్‌మైనా.. చదువుల్లో ముందుండే వాళ్లం. మధుకర్ అమెరికాలో స్థిరపడగా, కానిస్టేబుల్‌గా పనిచేసిన విశ్వనాథ్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. చిన్నప్పుడు క్లాస్ రూముల్లో క్లాస్ అంటే క్లాస్.. మాసంటే మాస్ అన్నట్లుగా ఉండే వాళ్లం. మాకు పాల వ్యాపారం ఉండడంతో నా వద్ద డబ్బులు బాగా ఉండేవి. కొట్లాటలు.. పంచాయితీలు కూడా ఎక్కువగానే ఉండేవి.. పదో తరగతిలోనే మిలటరీ బుల్లెట్‌పైన స్కూల్‌కు వచ్చేవాడిని. మా గల్లీలో నన్ను అందరూ రాజు అని పిలిచేవారు. ఇంటర్ ఫస్టియర్ బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కాలేజీలో చదివితే... సెకండియర్ మాత్రం మళ్లీ తాండూరు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో చదివాను. ఇంటర్ పూర్తయిన తరువాత జహీరాబాద్ దగ్గరలోని రంజోల్‌లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్‌లో చేరాను.. అనంతరం మళ్లీ బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్‌లో డిగ్రీ పూర్తి చేశాను.

ఒక్క ఓటుతో అమ్మ ఓటమి

మేము విద్యార్థి దశలో ఉన్న ఆ రోజుల్లో మా అమ్మ ఎల్లమ్మ రాజకీయాల పట్ల చాలా ఆసక్తి కనబరిచేది. అప్పట్లో మున్సిపల్ చైర్మన్లు పుల్లా అనంతరెడ్డి, శెట్టి చంద్రశేఖర్‌ల ప్రోత్సాహంతో అమ్మ బల్దియా ఎన్నికల్లో కౌన్సిలర్ పదవి కోసం ఆజంఖాన్‌పైన పోటీ చేసింది. కాగా, కేవలం ఒక్క ఓటుతో ఓడిపోయింది. అమ్మకు రాజకీయాల పట్ల మక్కువ ఉండడంతో నాకూ చిన్నప్పటి నుంచి ఆసక్తి ఏర్పడింది. నేను మొదట ఎన్‌ఎస్‌యూఐ తాండూరు పట్టణ అధ్యక్షుడిగా కొనసాగాను. తరువాత జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించాను. యువజన కాంగ్రెస్ మండల, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాను.

కిరణ్‌కుమార్ కేబినెట్‌లో మంత్రిగా..

మా అమ్మ నుంచే నాకు రాజకీయాల్లోకి రావాలన్న కాంక్ష ఏర్పడింది. అయితే ఎంపీటీసీ నుంచి స్పీకర్ స్థాయికి ఎదుగుతానని ఊహించలేదు. ఎంపీటీసీగా ఎన్నికై ఎంపీపీ అయ్యాను. ఆ తరువాత వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించాను.

నా స్నేహితులే కారణం

నేను ఈ రోజు ఈ హోదాలో ఉండడానికి కారణం నా స్నేహితులు మధుకర్, రాములు. నా చిన్ననాటి స్నేహితుడు మధుకర్, మర్పల్లికి చెందిన గూడెపు రాములు యాదవ్ నిజాం కాలేజ్‌లో కలిసి చదువుకున్నారు. ఇద్దరూ క్లోజ్ ఫ్రెండ్స్. వారిద్దరి మధ్య ఓసారి నా గురించి చర్చ వచ్చింది. మధుకర్ నా గురించి రాములుకు చెప్పాడు. రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పిస్తే ప్రసాద్ ఎమ్మెల్యే కూడా అవుతారని చర్చించుకున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రాములు నన్ను మర్పల్లికి పిలిపించి అక్కడి నాయకులకు పరిచయం చేయించి రాజకీయంగా ఎదగడానికి దోహదపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తరఫున 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో కోట్‌మర్పల్లి నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి ఎంపీపీగా ఎన్నికయ్యే అవకాశం కల్పించారు. 2001-2006 వరకు ఎంపీపీగా కొనసాగాను.

సద్భావన యాత్రతో ప్రత్యేక గుర్తింపు

అందరికంటే పెద్దక్క అయిన అనసూయ పెళ్లి మాజీ కేంద్ర మంత్రి గడ్డం(గుడిసెల) వెంకటస్వామి అన్న కొడుకు కృష్ణతో జరిగింది. మా రెండు కుటుంబాల ఇంటి పేర్లు గడ్డమే. కానీ రెండింటికీ స్వల్ప తేడా ఉండేది. మా పెద్దక్క పెళ్లి అయిన తరువాత మాకు వెంకటస్వామి గారి కుటుంబంతో అనుబంధం పెరిగింది. ఆయన నన్ను చాలా అభిమానించేవారు. చాలా ఇష్టపడేవారు. కుటుంబ సభ్యుడి కంటే ఎక్కువగా చూసుకున్నారు. 14 ఏళ్ల పాటు ఆయనకు దగ్గరుండి సేవ చేశాను. యువజన కాంగ్రెస్‌లో కొనసాగినప్పుడే చార్మినార్ నుంచి సికింద్రాబాద్ వరకు సద్భావన యాత్ర నిర్వహించాం. ఈ యాత్రలో ముఖ్య నేతలతో పాటు భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పార్టీలో నాకు ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది.



సన్నిహితులతో స్పీకర్



చిన్ననాటి స్నేహితులతో స్పీకర్ ప్రసాద్ కుమార్

అరుదైన గౌరవం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

నాకు రాజకీయ స్ఫూర్తి మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ. రాజకీయ అక్షరాభ్యాసం చేసింది మా అమ్మ ఎల్లమ్మ అయితే.. గురువు మాత్రం వైఎస్సార్. నా రాజకీయ ప్రస్థానంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పీకర్ పదవి ఇచ్చి నాకు అరుదైన గౌరవం కల్పించారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రి దామోదర రాజనర్సింహ నాకు అత్యంత సన్నిహితులు. ప్రతిపక్షంలో బండారు లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి సన్నిహితులు. మంచి మిత్రుడు మాత్రం టెమ్రీస్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ. అలాగే నచ్చిన నాయకుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి.

అక్క కూతురితో వివాహం

మా అక్క కూతురు శైలజను పెళ్లి చేసుకోవడం మరిచిపోలేని సంతోషకరమైన సంఘటన. అందరి అంగీకారం.. పెద్దల నిర్ణయంతో 1992లో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ఓడియన్ ఫంక్షన్ హాల్‌లో మా వివాహం జరిగింది. 2001, సెప్టెంబరు 24న మా కూతురు అనన్య జన్మించింది. పాప పుట్టినప్పుడు నాకు పట్టలేని సంతోషం కలిగింది. నా జీవితంలో అదొక అపురూపమైన మధుర ఘట్టం. ఆ సమయంలో నేను ఎంపీపీగా ఉన్నా.



కుటుంబ సభ్యులతో స్పీకర్ ప్రసాద్ కుమార్

2020 నవంబరులో కూతురు పెళ్లి చేశాను. ఆ మరుసటి నెల డిసెంబరులో నా భార్య శైలజ కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందింది. ఇది నా జీవితంలో అత్యంత బాధాకరమైన దుర్ఘటన. అలాగే నా కుమారుడు ఈశ్వర్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు.

పదేళ్లు తోడుగా....

నేను 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యాను. ఆ పదేళ్ల పాటు నాకు ఎలాంటి పదవి లేకున్నా... నాతో ఎవరూ లేకున్నా.. వెంకటేశం, రఘుపతిరెడ్డి, మల్లేష్ నాతోనే ఉన్నారు. బాధ అయినా, సంతోషమైనా వారితోనే పంచుకున్నా. వెంకటేశ్ నా బావమరిది అయినా స్నేహితుడిలా ఉంటాడు. సోన్‌పట్టి స్వీట్ అంటే నాకు చాలా ఇష్టం. నాటుకోడి కూర, జొన్నరొట్టె అంటే అమితమైన ఇష్టం. వికారాబాద్‌లోని ఇంట్లో నేను బాగా రిలాక్స్ అవుతాను.

వైఎస్సార్ చలువతో అసెంబ్లీ టికెట్



వైఎస్సార్‌తో ప్రసాద్‌కుమార్

వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా కొనసాగిన సమయంలో ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీఆర్ఎస్ వైఎస్‌తో విభేదించి 2008లో టీఆర్ఎస్ మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ సమయంలో వికారాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించాలని వైఎస్ పట్టుదలతో ఉన్నారు. ఆ ఎన్నికల్లో టికెట్ కోసం నాతో పాటు నవాబ్‌పేట్ మాజీ జడ్పీటీసీ కాలె యాదయ్య పోటీ పడ్డారు. సర్వేలన్నీ నాకు అనుకూలంగా ఉండడంతో వైఎస్ నాకే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించారు. ఆయన ఆశించినట్లు ఘన విజయం సాధించాను.

గెలుపు కన్నా క్రీడల్లో పాల్గొనడం ముఖ్యం



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబరు 8 : గెలుపు కన్నా క్రీడల్లో పాల్గొనడం చాలా ముఖ్యమని, ఓటమే గెలుపునకు నాంది అని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ శిక్షణా కేంద్రంలో పోలీస్ కానిస్టేబుల్స్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, 100, 200 మీటర్ల పరుగు పందెం, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించారు. ఎస్పీ హాజరై మాట్లాడుతూ ఓటములే జీవిత పాఠాన్ని నేర్పుతాయన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు రిటైర్మెంట్ వరకు ఫిట్‌గా ఉండడం కొరకు క్రీడలు, వ్యాయామం చాలా ఉపయోగపడుతాయన్నారు. అనంతరం గెలుపొందిన వారికి జ్ఞాపికలు అందించారు. డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీటీసీడీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్‌డీఎస్పీ వీరేశ్, సీఎల్ఐ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని కాపురంలో ట్యాక్సీ డ్రైవర్ చిచ్చు

- ఇద్దరు పిల్లలున్న మహిళను ట్రాప్ చేసిన కేటుగాడు
- ఆర్జీఐఏ పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు
- లండన్‌లో స్థిరపడిన కుటుంబం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 8 : లండన్‌లో స్థిరపడిన కుటుంబం.. భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో హాయిగా సాగిపోతున్న పచ్చని కాపురంలో చిచ్చుపెట్టాడో ఓ ట్యాక్సీ డ్రైవర్. ఈ ఘటన శంషాబాద్‌లోని ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అల్వాల్ ప్రాంతానికి చెందిన ఆ జంటకు 17 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వారికి కుమారుడు(13), కూతురు(12) ఉన్నారు. ఉద్యోగ బదిలీల్లో భాగంగా కొన్నేళ్ల క్రితం లండన్‌లో స్థిరపడ్డారు. 2024 ఫిబ్రవరిలో ఆమె తల్లి చనిపోయింది. అంత్యక్రియల కోసం లండన్ నుంచి హైదరాబాద్ వచ్చింది ఆ కుటుంబం. అయితే, అంత్యక్రియల అనంతరం 11 రోజుల తర్వాత అస్థికలను కలిపేందుకు బయటకు వెళ్లడానికి పహాడీషరీఫ్‌కు చెందిన ఓ ట్రావెల్స్ కారును బుక్ చేసుకున్నారు. అస్థికలు నదిలో కలిపిన అనంతరం తిరిగి ఇంటికి వచ్చారు. ట్యాక్సీ డ్రైవర్‌కు భార్య ఫోన్‌నుంచి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించారు. అయితే, ఆమె ఫోన్‌నంబర్ సేవ్ చేసుకున్న ట్యాక్సీడ్రైవర్ 'నీ నవ్వు బాగుంది.. మీరు చాలా అందంగా ఉంటారంటూ.. ట్రాప్‌లోకి దింపాడు. అప్పటి నుంచి ఇక్కడే ఉన్న ఆ మహిళ డ్రైవర్ మాటలకు మోసపోయి కొన్ని నెలలుగా అతనితో ఫోన్‌లో మాట్లాడుతోంది. విషయం అత్తగారింట్లో తెలియడంతో తమ కుమారుడికి విషయాన్ని చెప్పారు. వెంటనే కుమారుడు భార్యాపిల్లలను సెప్టెంబరు 16న లండన్‌కు రప్పించాడు. అయితే, సెప్టెంబరు 29న భర్త తల్లి చనిపోయింది. భార్యాపిల్లలను లండన్‌లో వదిలి అతడు ఒక్కడే ఇండియా వచ్చి తల్లి అంత్యక్రియలకు హాజరయ్యాడు.

కిడ్నాప్ చేశారంటూ..

ఆ సమయంలో లండన్‌లో ఉన్న ఆ మహిళ తన పిల్లలను ఒక పార్క్‌లో వదిలేసి సెప్టెంబరు 30న ఇండియాకు వచ్చింది. పిల్లలు వెంటనే తండ్రికి విషయం చెప్పారు. దాంతో ఆయన హుటాహుటిన లండన్‌కు వెళ్లాడు. అక్కడ ఆమె గురించి ఆరా తీయగా ఇండియాకి వచ్చి ముంబయి వెళ్లి అక్కడి నుంచి శంషాబాద్‌లోని మధురానగర్‌లో ఉన్నట్లు భర్త ఫోన్ చేయగా చెప్పింది. తనను ఎవరో కిడ్నాప్ చేశారని శంషాబాద్‌లో పెట్టారని భర్తతో చెప్పడంతో.. భర్త ఈనెల 6న ఆన్‌లైన్‌లో ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ట్యాక్సీ డ్రైవర్ సెల్‌ఫోన్ ట్రాక్ చేశారు. ఆమె డ్రైవర్‌తో కలిసి కారులో గోవాకు వెళ్తుండగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు వద్ద పట్టుకున్నారు. సోమవారం లండన్ నుంచి శంషాబాద్ వచ్చిన ఆమె భర్తకు ఆమెను అప్పగించి లండన్ పంపించినట్లు పోలీసులు తెలిపారు. ట్యాక్సీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పత్తి రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 8: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పత్తి పంటను కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 2లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిన్నింగ్ మిల్లుల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రమాణికమని, రైతులందరు తమ బ్యాంక్‌ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఫీడు కానీ రైతుల లిస్టుకు ఏఈవో సర్టిపై చేస్తే ఆన్‌లైన్ ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గ్రేడ్‌వన్‌కు మద్దతు ధర రూ. 7,521, గ్రేడ్ -2 రకానికి 7,121ధర నిర్ణయించడం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికారులు రైతుల కోసం పని చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, సీసీఏ బ్రాంచ్ మేనేజర్, విద్యుత్, రవాణా, పోలీస్ అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి సదరం క్యాంపులు

జిల్లాలోని దివ్యాంగుల కోసం ఈనెల 10 నుంచి సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 10న శారీక అంగవైకల్యంగల 60 మందికి, 14న బుద్ధిమాంద్యం గల 50 మందికి, 24న శారీరక అంగవైకల్యం గల 60 మందికి, 28న బుద్ధిమాంద్యం గల 50 మందికి, 30న వినికిడి లోపం గల 60 మందికి క్యాంపులు నిర్వహించి పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈనెల 10న శారీరక అంగవైకల్యం గల 60 మందికి 18న చూపులేని 50 మందికి 24న బుద్ధి మాధ్యం గల 50 మందికి, 29న శారీరక అంగవైకల్యం గల 60 మందికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇదివరకు సదరం సర్టిఫికెట్ పొంది కాలపరిమితి అయిపోయిన వారితో తోపాటు స్లాట్ బుక్ చేసుకున్న వారితో సహా 500 మందికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

రాజకీయాలకతీతంగా చేవెళ్ల అభివృద్ధి



సీఎం రేవంత్‌కు వినతిపత్రం ఇస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 8 : వేర్వేరు రాజకీయ పార్టీల ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా.. చేవెళ్ల ప్రాంత అభివృద్ధి విషయంలో రాజకీయాలకతీతంగా కలిసి సాగుతానని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొనడానికి హస్తినకు వెళ్లిన ఎంపీ న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై ఆయనతో చర్చించారు. ముఖ్యంగా జీవో నెంబర్ 111 ప్రాంతాన్ని ససెనబుల్ డెలవప్‌మెంట్ జోన్‌గా మార్చాలని, టీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న షాబాద్ మండలంలోని సీతారాంపురం గ్రామ దేవాలయం భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని, జంట నగరాలలో నడుస్తున్న సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్వహణతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణపై పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సమగ్ర చర్చ జరిపి సీఎంకు నిర్దిష్టమైన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోపాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తన సహాయ సహకారాలు, సూచనలు సలహాలు ఎల్లవేళలా అందిస్తానని రేవంత్‌రెడ్డికి తెలిపినట్లు చెప్పారు. కాగా, రాజకీయాలకతీతంగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలను అభివృద్ధి పథంలో మైలురాళ్లుగా నిలపడమే తన ముందున్న ప్రథమ కర్తవ్యం అని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారి దర్శనం



కొంగరకలాన్ శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారు

ఆదిబట్ల/కేశంపేట/మహేశ్వరం/మాడ్గుల/షాబాద్/యాచారం/కందుకూరు/ఆమనగల్లు/కడ్తాల్/చేవెళ్ల, అక్టోబరు 8: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను భక్తులు రోజుకో రూపంలో సేవిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మహాలక్ష్మి అవతారంలో పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు, దసరాను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మండపాల్లో దేవీమాతలను వివిధ రూపాల్లో కొలుస్తున్నారు. ఆదిబట్ల పరిధి కొంగరకలాన్ శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీదుర్గామాత ఉత్సవ కమిటీ అధ్వర్యం అభిషేకాలనంతరం చండీ యాగం నిర్వహించారు. పూజారి మహేష్‌శర్మ అధ్వర్యంలో నిర్వహించిన యాగంలో 16 జంటలు పాల్గొన్నాయి. బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్, కౌన్సిలర్ వి.శ్రీనివాస్, లక్కరాజు శ్రీనివాస్‌రావు, రాధిక, వెంకట్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, చంద్రశేఖర్‌చారి, విజయభాస్కర్‌చారి పూర్ణాహుతిలో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం కుంకుమార్చన నిర్వహించారు. కేశంపేట, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, కాకునూర్, లింగంధన, లేమామిడి, సంతాపూర్ గ్రామాల్లో దుర్గమాత మండపాల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. కేశంపేటలో ఇరువెంటి రాఘవేందర్ భక్తులకు నిత్యాన్నదానం చేస్తున్నారు. కార్యక్రమాల్లో పల్లె ఆనంద్‌కుమార్, బాలీశ్వర్, సూరం శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, శివాజీ, యాదయ్య, సాయిలు, నర్సింహ, ఉజ్వల్, మహేష్, యాదయ్య, సురేందర్, హనుమాన్, విఘ్నేష్, అనిల్‌గౌడ్, మదన్‌మోహన్, రవికిరణ్, నరేష్, కృష్ణ, ప్రకాశ్‌చారి పాల్గొన్నారు. మహేశ్వరంలోని రాజరాజేశ్వరాలయం లో మహాలక్ష్మీదేవీగా పూజలందుకున్నారు. సుప్రభాతసేవ,పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఫలహారాభిషేకం, మంత్రపుష్ప పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కుమార్, సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, నవీన్, కృష్ణ, ఈవో మురళీకృష్ణ, రాజు, రాజేష్, రాములు, చందు, నరేష్ పాల్గొన్నారు. మాడ్గుల, ఆర్కపల్లి, ఇర్విన్ గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను నెలకొల్పారు. ఆర్కపల్లిలో మాజీ సర్పంచ్ జంగయ్య కుటుంబసమేతంగా పూజలు నిర్వహించి నిర్వాహకులకు 10 వేల నగదు అందచేశారు. కార్యక్రమంలో కాటం రాజు, సందీప్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద జైభవానీ సేవా సమితి నెలకొల్పిన అమ్మవారు మహాలక్ష్మీ రూపంలో దర్శనమిచ్చారు. షాబాద్ మండల గ్రామాల్లో ఆరోరోజు మహాలక్ష్మీదేవీ అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నదానాలు చేశారు. యాచారం మండల గ్రామాల్లో దుర్గాపూజలు వైభవంగా చేస్తున్నారు. యాచారం, నందివనపర్తి, మేడిపల్లి, మాల్ గ్రామాల్లో అమ్మవారి మండపాల వద్ద ఉదయం, రాత్రివేళ పూజలు చేస్తున్నారు. మాల్‌లో రోజూ కాంగ్రెస్ నాయకుడు పడకంటి శేఖర్ తదితరులు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. కందుకూరు, నూదునూరు, దెబ్బడగూడ, గూడూరు, లేమూరు, అగర్‌మియాగూడ, మీర్ఖాన్‌పేట, ముచ్చర్లలో అమ్మవారి మండపాల వద్ద పూజలు చేస్తున్నారు. రాత్రి కోలాటాలు ఆడుతూ భజన చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం మండపం వద్ద అన్నదానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమనగల్లులోని మార్కండేయాలయంలో నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. అప్పం శ్రీను-శ్రీలత దంపతులు హోమం నిర్వహించారు. ఉత్సవాలకు ఎంపీడీవో కుసుమమాధురి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంగళి బాలకృష్ణ, రవి, అప్పి, గాజుల శ్రీను, వాసు, యాదగిరి, భద్రయ్య, దగిరి, రమేశ్, శ్రీధర్, రవి, మహేశ్, నిరంజన్, ఆనంద్, అలివేలు, శ్రీలత, రమ్య, లీలావతి, సువర్ణ, స్వాతి, పెంటమ్మ, సుజాత, జంగమ్మ, సుమతమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్,ప్రధానకార్యదర్శి బి.నర్సింహ, ట్రెజరర్ శ్రీనివాస్, నర్సింహ, విజయ్ పాల్గొన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి శివరామాలయంలో నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేలహత ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పూజారి మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామేవేందర్, తహసీల్దార్ ఆర్పీ.జ్యోతి, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. చేవెళ్లలోని రచ్చబండ దుర్గామాతకు పూజలు చేస్తున్నారు. అలాగే మల్కాపూర్, కందవాడ, పామెన, దామరిగిద్ద, కమ్మెట, ఆలూర్, తంగడ్‌పల్లి గ్రామాల్లో దుర్గామాతకు పూజలు చేస్తున్నారు.



కేశంపేటలో మాలధారణ స్వాముల పూజలు



మహేశ్వరంలో పూజలు చేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



శంషాబాద్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కౌన్సిలర్ వెంకటేష్



కొత్తూర్ దుర్గాదేవి అసోసియేషన్ ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద భక్తుల పూజలు



కందుకూరు:అగర్‌మియాగూడలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మైసిగండిలో అమ్మవారి పూజల్లో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీ పంతూ తదితరులు

కాంగ్రెస్ జిమ్మిక్కులను నమ్మని హర్యానా ఓటర్లు



మహేశ్వరంలో విజయ సంకేతం చూపుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు

కందుకూరు/మహేశ్వరం, అక్టోబరు 8: కాంగ్రెస్ అధిష్ఠానం ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు ఎన్ని జిమ్మిక్కులు చేసినా హర్యానా ప్రజలు బీజేపీనే నమ్మి మరోసారి పట్టంకట్టారని బీజేపీ మహేశ్వరం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో ఐదు గ్యారంటీలు, తెలంగాణలో ఆరు గ్యారంటీలంటూ చెప్పి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. హర్యానా ఎన్నికల్లోనూ ఏడుగ్యారంటీలతో బరిలో దిగిన ఆ పార్టీని ప్రజలు నమ్మలేదని, ఇది ఫలితాలతో స్పష్టమైందన్నారు. హర్యానాలో విజయంతో మహేశ్వరంలో బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలే దేశంలో బీజేపీ అప్రతిహత విజయాలకు కారణమన్నారు. ర్యాలీలో నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, దేవేందర్‌రెడ్డి, సుదర్శన్‌యాదవ్, శ్రవణ్, మల్లేష్, పరమేష్, రాజునాయక్, నాగరాజు, విజయ్, రాఘవేందర్, యాదయ్య పాల్గొన్నారు.

ప్రజల చూపు బీజేపీ వైపు



చటాన్‌పల్లిలో బీజేపీ సభ్యత్వాలు అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్/కేశంపేట/ఎల్‌బీనగర్, అక్టోబరు 8: ప్రజల చూపు బీజేపీ వైపు మళ్లుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ చటాన్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదుకు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై సభ్యత్వాలు అందజేశారు. అయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీలో చేరుతు న్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్, అత్తాపూర్ మహేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తోందని కేశంపేట మండల సభ్యత్వ నమోదు కో-కన్వీనర్ కుమ్మరి మహేష్ అన్నారు. దేవనిగుడి తండాలో సభ్యత్వ నమోదు చేపట్టారు. సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్, భక్తవత్సల్, రెడ్యా, పీర్యా, రమేష్ పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మైనారిటీలను వాడుకున్నదని కాంగ్రెస్ పార్టీ అని, అయితే వారిని ఆదుకున్నది మాత్రం ప్రధాని నరేంద్రమోదీ అని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లో కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డితో కలిసి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అయన ప్రారంభించారు.

స్పీకర్‌కు స్వాగతం పలికిన భీం భరత్



ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్, నాయకులు

షాబాద్, అక్టోబరు 8: విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి భార్గవ్‌రామ్, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ టి.రవీందర్, మాజీ సర్పంచులు ముక్కు రవి, మల్లేష్, సత్యనారాయణ, హస్మత్‌పాషా,వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య, బందయ్య, ప్రభాకర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

వాల్‌రైటింగ్ బ్యాన్‌తో కళాకారులకు ఉపాధి కరువు



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 8: జీహెచ్‌ఎంసీ పరిధిలో వాల్‌రైటింగ్‌లపై బ్యాన్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వాల్‌రైటింగ్ కళాకారులు, పెయింటర్లు ఉపాధి కోల్పోతారని రాష్ట్ర చిత్రకారుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రూపం వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఆమనగల్లులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫ్లెక్సీల రాకతో ఇప్పటికే పెయింటర్లు కునారిల్లుతున్నారన్నారు. ఇక వాల్‌రైటింగ్స్‌ను కూడా నిషేధిస్తే పెయింటర్లు ఎలా బతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వ శాఖల్లో పెయింటింగ్ పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా నేరుగా పెయింటర్లకే ఇవ్వాలని ఆయన కోరారు. కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చేయూతనందించాలన్నారు. సమావేశంలో లింగంగౌడ్, కొండలచారి, శ్రీనివాస్, మల్లేశ్, యాదయ్య ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ సాధన కోసం నిరసన'

శంషాబాద్ రూరల్, అక్టోబరు 8: ఎస్సీ రిజర్వేషన్ల ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధన కోసం బుధవారం నిరసన కార్యక్రమాలు చేపడుతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు తెలిపారు. నిరసన కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం ఇచ్చారు. వారు విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఎస్సీ వర్గీకరణ అమలుచేయకుండా ఉద్యోగ ఇయామకాలు చేపట్టారని, మంద కృష్ణ పిలుపు మేరకు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. శంషాబాద్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



అజీజ్‌నగర్‌లో క్రీడాకారులతో బండ్లగూడ శ్రీధర్

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 8 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అజీజ్‌నగర్ వాసి బండ్లగూడ శ్రీధర్ అన్నారు. మంగళవారం గ్రామ క్రికెట్ టీమ్‌కు జెర్సీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం ఇస్తానన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులున్నారు.

షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పీడీ నాయుడు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 8: షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పీడీ నాయుడు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌వోటీ మాదాపూర్‌లో పని చేసిన ఆయన బదిలీపై షాద్‌నగర్ వచ్చారు. ఆయనకు ఇన్‌స్పెక్టర్ వి.యస్‌కుమార్ అభినందనలు తెలిపారు. దొంగతనం చేశారనే నెపంతో దళిత మహిళను కొట్టారనే ఆరోపణలపై ఇక్కడి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి సస్పెండయ్యారు. అనంతరం వచ్చిన ప్రశాంత్ పది రోజులు పనిచేశారు. ప్రస్తుతం పీడీ నాయుడు వచ్చారు.

ఫార్మాసిటీ స్టేషన్ సీఐగా కృష్ణంరాజు

యాచారం అ క్టోబరు 8: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా లిక్కి కృష్ణంరాజు మంగళవారం రాత్రి బాధ్యత చేపట్టారు. ఆయన గతంలో యాచారం ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ఆయనను మేడిపల్లికి చెందిన కలకొండ బీరప్ప తదితరులు సత్కరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన నర్సింహారావు మహేశ్వరం ట్రాఫిక్ సీఐగా బదిలీ కాగా, అక్కడి ట్రాఫిక్ సీఐ కృష్ణంరాజు ఇక్కడికొచ్చారు.

మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దు



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల, అక్టోబరు 8: వాహనాదారులు మితిమీరిన వేగంతో డ్రైవ్ చేయొద్దని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. మంగళవారం చేవెళ్లలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని వాహనదారులకు చెప్పారు. మితిమిరిన వేగంతో డ్రైవింగ్‌ల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనాల ఓవర్‌టేక్ మానుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరం అన్నారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెంట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్‌లు, వాహనాదారులు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు



మైసమ్మ దేవతకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మదుసూధన్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 8: ఆలయాల అభివృద్ధికి, భక్తులకు సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవకద్ర ఎమ్మెల్యే మదుసూధన్‌రెడ్డి అన్నారు. మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించారు. మైసమ్మకు పూజలు నిర్వహించారు. ఆయనకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు జవహర్‌లాల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్‌లు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సామాజిక న్యాయం, సమానత్వమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు తులసీరామ్‌నాయక్, రాము, సుధీర్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

- **ఆమనగల్లు:** రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం కేఎస్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.
- **ఆమనగల్లు:** క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మహేశ్ అన్నారు. ఆమనగల్లులో నిర్వహిస్తున్నప్రీమియర్ లీగ్ సీజన్-2 పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు జెర్సీలందజేశారు.

యాచారం : మండలానికి స్టేట్‌ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.45.25 లక్షలు విడుదలయ్యాయని ఎంపీవో శ్రీలత మంగళవారం తెలిపారు.

కడ్తాల పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి



రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్‌కు వినతి పత్రం అందజేస్తున్న జీఎల్‌ఎన్‌రెడ్డి, వెంకటేశ్, ఆనంద్

కడ్తాల్, అక్టోబరు 8:కడ్తాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కోరారు. మంగళవారం డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ బి.ఆనంద్, కడ్తాల బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణలతో హైదరాబాద్‌లోని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చొరవతో 2023 సెప్టెంబరు 22న కడ్తాలకు ఆరోగ్య కేంద్రం మంజూరైందని తెలిపారు. భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అయినా నేటికీ ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టలేదని లక్ష్మీనర్సింహారెడ్డి వాపోయారు. రాష్ట్రంలో మిగతా చోట్ల పనులు చేపట్టినా ఇక్కడ మొదలేపెట్టలేదని అధికారి దృష్టికి తెచ్చారు. ఎన్నికల రాకతో ఆసుపత్రి భవన నిర్మాణం గత ప్రభుత్వం మొదలె పెట్టలేదన్నారు. ఇప్పటికైనా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు లాయక్‌అలీ, మంగళపల్లి నర్సింహ, బాచిరెడ్డి నరేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, మూడ అశోక్ తదితరులు ఉన్నారు.

నైపుణ్యాలపై దృష్టి సారించాలి



ప్రొఫెసర్ జహంగీర్‌ను సత్కరిస్తున్న కాలేజీ నిర్వాహకులు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 8: విద్యార్థులు కొత్త నైపుణ్యాలను, ఆధునికతను అలవార్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ హెడ్ ఆఫ్ ద డిపార్టుమెంట్ ప్రొఫెసర్ జహంగీర్ అన్నారు. చిలుకూరు పరిధి అరిస్టాటిల్ పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఓరియెంటేషన్ డేకు జహంగీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేజీ.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అరిస్టాటిల్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, రమేష్, రాజేందర్ రెడ్డి, నందకిషోర్, శ్వేత, జ్యోతికాసోని, రాకేష్, త్రివేణి పాల్గొన్నారు.

పాఠకులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి



మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాబాద్, అక్టోబరు 8: జిల్లాలోని అన్ని చిన్న, పెద్ద గ్రంథాలయాల్లో పాఠకులకు, విద్యార్థులకు, యువతకు అవసరమైన వసతులు కల్పించేందుకు కృషిచేస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయనకు మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నగరంలోని మధుసూదన్‌రెడ్డి ఇంటికి మద్దూర్ మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ప్యాక్స్ మాజీ డైరెక్టర్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఇతర నాయకులు వెళ్లి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులతో మధుసూదన్‌రెడ్డి చర్చించారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



ఆమనగల్లులో బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



షాద్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న రెడ్డి సేవా సంఘం మహిళలు

ఎక్కువ డబ్బులిస్తామని టోకరా



వాట్సాప్ గ్రూప్‌లో చాట్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 8: మీరు కొంత డబ్బు చెల్లిస్తే దానికంటే ఎక్కువ తిరిగి ఇస్తామని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టి ప్రజలను మోసం చేస్తున్న కేటీగాళ్ల బాగోతం బయటపడింది. 'శ్రీసాయి సాద్విత రియల్ వెంచర్' పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసిన మోసగాళ్లు రూ.15వందలు చెల్లిస్తే 14,500 వెంటనే అకౌంట్లో వేస్తామంటూ మెసేజ్ పెట్టారు. పోలీస్ అధికారులు కూడా చాట్ చేస్తున్నట్లు నమ్మించారు. ఇది నమ్మిన కొందరు మోసగాళ్లు చెప్పిన నంబరుకు డబ్బు పంపారు. డబ్బు పంపిన వారి పేర్లను గ్రూపు నుంచి డిలీట్ చేస్తున్నారు. షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన శివ అనే యువకుడు రూ.15వందలు పంపాడు. పంపిన వెంటనే అతడి నంబరు గ్రూప్‌నుంచి రిమూవ్ చేశారు. కొందుర్గుకు చెందిన ఓ యువకుడి పేరు, నంబర్‌తో గ్రూప్ అడ్మిన్‌గా క్రియేట్ చేశారని తెలిసింది. మోసపోయిన వారు అడ్మిన్ నంబర్‌కు కాల్‌చేస్తే తన నంబర్‌ను అక్రమంగా వాడుతూ మోసగిస్తున్నట్టు అతడు తెలిపాడు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేయాలని బాధితులు కోరుతున్నారు.

షాదీఖానా కోసం స్థల పరిశీలన



మైనారిటీ నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

చౌదరిగూడ, అక్టోబరు 8 : జిల్లేడ్ చౌదరిగూడలో షాదీఖానా నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. మంగళవారం మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, నాయకులు ఎజాజ్ అలీ, అజ్మీర్, మహమూద్‌లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ షాదీఖానా నిర్మాణానికి కార్పొరేషన్ నిధులు మంజూరయ్యాయన్నారు. పీఆర్ ఏఈ వంశీకృష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలివ్వాలి



ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

షాబాద్, అక్టోబరు 8: అంతారం డబ్ల్యూటీపీ వద్ద మిషన్ భగీరథ కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ వారికి మద్దతిచ్చారు. ఆయన మాట్లాడుతూ... ఇక్కడ పనిచేస్తున్న 15మంది కార్మికులకు రెండు నెలల జీతాలు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాల ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించని కేఎస్ఆర్ కాంట్రాక్టర్, ఎస్సీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథలో వారి కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

ఆమనగల్లు, అక్టోబరు 8: ఆమనగల్లు సమీపంలోని దుబ్బగట్టు వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అతడు వారం రోజుల క్రితం చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని సీతాఫలాల కోసం వెళ్లిన కొందరు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్‌లు అక్కడికి చేరుకొని పరిశీలించారు. మృతుడు 30ఏళ్ల పైబడి ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయింది. డెడ్‌బాడీ వద్ద మద్యం, పురుగుల మందు, నీళ్ల బాటిళ్లు, బ్యాగ్ ఉన్నాయి. బ్యాగ్‌లో చీరలు, మరో పురుగుల మందు డబ్బా ఉన్నాయి. ఈ వ్యక్తి ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి సంబంధించి ఏమైనా వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వెంకటేశ్ కోరారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శివకుమార్

కొత్తూర్, అక్టోబరు 8: మల్లాపూర్‌నకు చెందిన చిర్ర శివకుమార్(30) మంగళవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శివకుమార్‌కు ఆర్థిక ఇబ్బందులూ తోడ య్యాయన్నారు. మనస్థాపంతో గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించామని, శివకుమార్ తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.